క్లుప్తంగా

మీ సేవ కేంద్రం ప్రారంభం

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్‌లో ఆదివారం జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా డైరెక్టర్ ఇమ్ము, నాయకులు నవీన్‌రెడ్డి, వెంకటేశ్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మహమ్మదాబాద్: గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు సర్పంచ్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జూలపల్లిలో రూ.5లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలు, పల్లె ప్రకృతివనం, మెగాపార్కు నర్సరీల పెంపకం పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఉత్సాహంగా కిక్‌బాక్సింగ్ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ప్రాంగణంలో జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు. 40మంది విద్యార్థులు మ్యూజికల్ ఫాం, పాయింట్ ఫైట్, కిక్‌లైట్ ఎంపికల్లో పాల్గొన్నట్లు స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు వచ్చేనెలలో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రవినాయక్, సీనియర్ విద్యార్థులు నవీన్, నిఖిల్, జయదీప్‌సింగ్, రోహిత్, యామిని తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల శ్రమదానం



గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ బండమీది రామస్వామి ఆలయ పరిధిలో గ్రామానికి చెందిన యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఆలయం పురాతనమైనది కావడంతో నాలుగైదు నెలలుగా ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో అక్కడ కూల్చిన మట్టి, సిమెంట్ తదితర సామగ్రిని యువకులు అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారెడ్డి, సత్యసాయి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివమల్లప్ప, మండల కన్వీనర్ నారాయణ్‌రెడ్డి, రామస్వామి, భజనమండలి భక్తులు రాములు, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా యాదయ్య

బాలానగర్: ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గుడిసె యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి, రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, బాలయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.మురళి

జడ్చర్ల టౌన్: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పి.మురళిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బండప్రకాష్‌ముదిరాజ్ ఆదివారం నియామకపు పత్రం అందజేశారు. జిల్లాల కమిటీలను, అనుబంధ విభాగాలను నిర్మాణం ద్వారా ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషిచేయాలని ఆయన సూచించారు.

కార్యవర్గ సభ్యుడిగా మాధవులు

కోయిల్‌కొండ: మండలంలోని కోత్లాబాద్‌కు చెందిన మాధవులును జిల్లా ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సభ్యుడిగా నియమించడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు బండప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు కిశోర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితులకు చేయూత

దేవరకద్ర రూరల్: మండలంలోని మీన్గోనిపల్లికి చెందిన ప్రదీప్ వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. 2003–04లో దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న స్నేహితులందరూ కలిసి రూ.65వేలను పోగుచేసి ఆదివారం ప్రదీప్ భార్యకు అందజేశారు.

కౌకుంట్లలో..

కౌకుంట్ల మండలానికి చెందిన బాలమణి కొన్ని రోజుల కిందట ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుంది. 1991–92లో కౌకుంట్లలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.30వేలు జమచేసి అందజేశారు.



ఎటు చూసినా దుర్గంధం



వార్డ్ వాచ్

న్యూబాలాజీనగర్‌లో రోడ్డు పక్కన ఉన్న మురుగు గుంత

- న్యూబాలాజీనగర్‌లో మురుగు గుంతతో ఇబ్బందులు
- పాతపాలమూరు, రహీసా మసీదులో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- దెబ్బతిన్న బీటీ, సీసీ రోడ్లు

ప్రధాన వీధులు: పాతపాలమూరు, బాలాజీనగర్, న్యూబాలాజీనగర్, భూలక్ష్మి ఎన్‌క్లేవ్, రహీసా మసీదు ప్రాంతం (కొంత భాగం)	వార్డు 11
	జనాభా 5,777

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 11వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. భగీరథకాలనీ చౌక్‌కు ఎదురుగా ఉన్న న్యూబాలాజీనగర్‌లోకి వెళ్లే మార్గంలో బీటీరోడ్డు అధ్వానంగా తయారైంది. ఆ పక్కనే కుడివైపు 9అడుగుల మురుగు గుంత తవ్వారు. సమీపంలోని సుమారు 20 ఇళ్లతో పాటు ఇటీవల కొత్తగా నిర్మించిన పెద్ద అపార్ట్‌మెంట్ (సుమారు 45 ఫ్లాట్స్) నుంచి అండర్‌గ్రౌండ్ పైపు లైన్ వేశారు. ఈ మొత్తం మురుగు ఈ గుంతలో పడి నిండి పొంగిపొర్లుతోంది. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోందని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. దోమలు పెరిగి తరచూ రోగాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. ఇదే దారిలో పది స్తంభాలకు వీధిదీపాలు లేవన్నారు. రాత్రివేళ మొత్తం చీకటి ఆవరించడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. న్యూబాలాజీనగర్‌లో చాలా చోట్ల ఎక్కడిక్కడ సీసీరోడ్లు సగం వరకే వేసి వదిలేశారు. కుక్కలు, పందుల బెడద తీవ్రంగా ఉంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బాలాజీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు ఒకేచోట చేరి మడుగులా తయారైంది. గల్లీల్లో డ్రెయినేజీ నిర్మించి సమీపంలోని పెద్దకాల్వలో కలపాలని స్థానికులు కోరుతున్నారు. చుట్టుపక్కల వీధి లైట్లు వెలగడం లేదన్నారు. పలుచోట్ల సీసీరోడ్లు ధ్వంసమయ్యాయి. పారిశుద్ధ్య సిబ్బంది 15రోజులకోసారి మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారని వారు వాపోయారు. పాతపాలమూరులోని ఎస్సీవాడలో కొన్నిచోట్ల సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారైంది. కాల్వల్లో మురుగు ముందుకు కదలడం లేదు. ఇదే పరిస్థితి రహీసా మసీదు ప్రాంతంలోనూ నెలకొంది. చెత్త ఆటో సరిగా రాదని, ఓపెన్ ప్లాట్లు చెత్తాచెదారంతో నిండిపోయాయని స్థానికులు చెబుతున్నారు.



రహీసా మసీదు ప్రాంతంలో ఇలా..



బాలాజీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో నిలిచిన మురుగు

డ్రెయినేజీ బ్లాక్ అయ్యింది..



చుట్టుపక్కల ఇళ్ల నుంచి పైపుల ద్వారా వచ్చే మురుగంతా రోడ్డు పక్కన తవ్విన పెద్దగుంతలో చేరి బ్లాక్ అయింది. అటు వైపు వెళ్తున్నప్పుడు దుర్గంధం వస్తోంది. దోమలు పెరిగిపోతున్నాయి. రెండేళ్ల నుంచి ఈ సమస్య నెలకొంది. సీసీ రోడ్లు లేవు. కౌన్సిలర్ దృష్టికి తెచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు.

– సుజాత, గృహిణి, న్యూబాలాజీనగర్

పరిసరాలు అపరిశుభ్రం..



మా వీధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేదు. మా ఇంటి వద్ద పెద్ద మురుగు కాల్వ ఉంది. ఇక్కడికి మున్సిపాలిటీకి చెందిన చెత్త బండి రాదు. దీంతో చుట్టుపక్కల వారు సమీపంలోని ఓపెన్ ప్లాట్లలో చెత్తను పారవేస్తున్నారు. పందులతో పాటు విషసర్పాలు తిరుగుతున్నాయి. వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. ఏరోజు కూడా పారిశుద్ధ్య కార్మికులు రారు. పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా తయారయ్యాయి.

– మహ్మద్, రహీసా మసీదు ప్రాంతం

రూ.3.5కోట్లతో పనులు చేపట్టాం..



సుమారు రూ.3.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. రహీసా మసీదు ప్రాంతంలో నిలిచిపోయిన మురుగును జేసీబీతో తొలగించాం. త్వరలోనే డ్రెయినేజీ నిర్మిస్తాం. ముఖ్య కూడళ్లలో 3 హైమాస్ట్ లైట్లు బిగించాం. వార్డులో పలుచోట్ల 25 స్తంభాలు పాతి విద్యుత్ తీగలు సరి చేయించాం. బాలాజీ నగర్‌లో సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మిస్తాం. బండమీదిపల్లిలోని వాటర్ ట్యాంకు నుంచి పాతపాలమూరుకు తాగునీటి పైపులైన్ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయి.

– ఎస్.శ్రీనివాసులు, కౌన్సిలర్, 11వ వార్డు

పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నెక్కొండలో గుడిసె వద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: ఇల్లు లేని నిరుపేదకుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నెక్కొండ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ కుటుంబం నివసిస్తున్న గుడిసెను చూసి ఆయన చలించి పోయారు. వెంటనే ఆయనకు డబుల్‌బెడ్రూం ఇల్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే చాలా చోట్ల డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించిందని, వాటిని త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఇంటి నిర్మాణ పథకం కింద ఖాళీ స్థలం ఉన్న వారికి రూ.3లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇల్లు లేని వారందరికీ దశలవారీగా మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని ఆదివారం 62వ రోజు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామునాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల పాలనా సౌలభ్యం కోసం రెండో మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిలేదీక్షలో జేఏసీ నాయకులు డాక్టర్ చంద్రయ్య, రవి, బాలు, రాజు, లక్ష్మీనారాయణ, ఉపేందర్, ముస్తాక్, కృష్ణారెడ్డి, భగవంతు, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితోత్సవంలో జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితోత్సవంలో జిల్లాకు చెందిన పలువురు కవులు పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో కవులు బసవ రాజప్ప, నందిగామ కిషోర్, జోషి మధుసూదన్‌శర్మ, భూచంద్ర పాల్గొని తమ కవితలు వినిపించారు. కవులను నిర్వాహకులు ప్రశంసాపత్రం, మెమొంటోలతో సత్కరించారు.



కవితోత్సవంలో పాల్గొన్న జిల్లా కవులు

మత్స్యకార్మిక సంఘం ఎన్నిక

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లిలో మత్స్యకార్మిక సంఘం గ్రామ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు సతీష్ ఉన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో వెంకటేష్

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ-కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేష్ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్‌లో భావేష్, యశ్వంత్, జామ్ శివశంకర్‌లు మొదటి స్థానంలో, సంతోష్ రెండోస్థానంలో నిలిచి పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ వెంకటేష్ తదితరులు అభినందించారు.

కురుమూర్తి స్వామి ఆలయంలో హోమం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మపూరం సమీపంలో వెలిసిన కురుమూర్తి స్వామి ఆలయంలో పూజారులు ఆదివారం హోమం నిర్వహించారు. రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠాపనలో భాగంగా రెండో రోజు దేవతాపూజలు, అభిషేకం, హోమ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హన్వాడ/ మహమ్మదాబాద్: సీపీఎం చేపట్టిన జన చైతన్య బస్సు యాత్ర ఆదివారం హన్వాడ, మహమ్మదాబాద్ మండలాల మీదుగా వెళ్లింది. తాండూర్ ప్రధాన రహదారి గుండా సీపీఎం నాయకులు ర్యాలీగా వెళ్తూ నినాదాలు చేశారు. కేంద్రంలోని సర్కారు ప్రజావ్యతిరేక విధానలకు పాల్పడుతోందని విమర్శలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ, టి.సాగర్, రమా, ఆర్.వెంకట్రాములు, జిల్లా అధ్యక్షుడు రాములు, కిల్లెగోపాల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు రామాయణ పారాయణం

నవాబుపేట: మండల కేంద్రంలో ఈనెల 28న సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో రామాయణ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ పండితులు శ్రీప్రాణేష్ శర్మ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని లయోలా జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు (2008–10) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనుగొండలోని అనాథ శరణాలయంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమానికి గురువు విజేత వెంకట్‌రెడ్డిని ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాను, ఆనంద్, నిఖిల్, భూపాల్, దూద్‌వలి, రాజేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాములు, దశరథ్, దీపక్, భరత్, శివరాం పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేసిన విజేత వెంకట్‌రెడ్డి

కొమిరెడ్డిపల్లిలో కబడ్డీ టోర్నమెంట్

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో ఈనెల 28న హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ సంతోషి, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, యువజన సంఘం అధ్యక్షుడు గణేష్‌గౌడ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.10,116లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9390618034 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

రాజాపూర్: చదువుతో పాటు యువకులు క్రీడలకు ప్రాముఖ్యత నివ్వాలని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లపొట్లపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చిన్నారులు, యువకులకు ఆటలాడుకునేందుకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, నాయకులు రమేష్‌నాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంబిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండలంలోని ప్రసిద్ధ శ్రీరామకొండ క్షేత్రం అంకిళ్లకు చెందిన ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకిళ్లలో ఏర్పాటు చేసిన శ్రీరామ అలయం సంప్రోక్షణ కోసం శ్రీరామకొండపై ఉన్న మహిమాన్వితమైన కోనేరులో నీటిని తీసుకెళ్లారు. ఇప్పటికే భద్రాచల గోదావరి, కృష్ణానదుల నీటిని తీసుకొచ్చినట్లు తెలిపారు.

పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా సప్తాహ మహోత్సవాలు

దేవరకద్ర: మండల కేంద్రంలో వెలసిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయంలో ఆదివారం 94వ సప్తాహ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారి పల్లకీసేవ కార్యక్రమం అనంతరం సప్తాహ మహోత్సవాలను ప్రారంభించారు. వారం రోజుల పాటు అఖండ భజనలు కొనసాగిస్తారు. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం సమీపంలోనే వీరప్పయ్యస్వామి మఠం ఉంది. ఉత్సవాల్లో పలువురు మహిళలు సేవా కార్యక్రమాలలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ శివానంద్, ఈట కోమల్‌చ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భజనలు చేస్తున్న భక్తులు

వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

మిడ్జిల్: మండల కేంద్రంలో వాడిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనంగా విగ్రహాలను ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపతమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, శంకర్, తిరుపతి, విజయ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మహాత్మాగాంధీ రోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 50ఏళ్ల కిందట పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలియ తిరిగి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నర్సోజీరావు, రాంచందర్‌జీలను ఘనంగా సన్మానించారు. అంతకుముందు పాఠశాల ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శెట్టి చంద్రశేఖర్, భాగన్న గౌడ్, సీవీ రమణ, లింగారెడ్డి, జమునా రాణి, సుమిత్రాశెట్టి, ఎ.రాజసింహుడు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మణికొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం గురువులు బాలప్ప, నారాయణ, లక్ష్మీనారాయణలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంగు గంగన్న, జీహెచ్‌ఎం రహెమాన్, ఎస్‌ఎంసీ చైర్మన్ యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రత్యేక శిబిరాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దత్తత గ్రామాల్లో త్వరలోనే ప్రత్యేక శిబిరాలు ప్రారంభించనున్నట్లు పీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.కె.ప్రవీణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబగద్వాల, వనపర్తి జిల్లాలలో వచ్చే నెలాఖరు వరకు, 25–30 శిబిరాలు కొనసాగుతాయన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వేసవి ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో క్యాంపు కార్యకలాపాలతో పాటు ఉంటుందన్నారు.